

ప్రమాదపుటంచుల్లో ..
జిల్లాలోని పలు పరిశ్రమలు కాలుష్య నిలయాలుగా, ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. 10లో▸



కానరాని రైతు నేస్తాలు
వ్యవసాయ పనుల్లో అన్నదాతలకు అండగా ఉండే కాడెడ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. 10లో▸



మృత్యు మార్గాలు
ప్రమాదకర మలుపులతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సూచిక బోర్డులు సైతం లేవు. 10లో▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్‌: మండల పరిధిలోని తెలంగాణ మోడల్‌ కళాశాలలో నాలుగు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీవాత్స ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడల్‌ స్కూల్‌, కళాశాలలో హెచ్‌బీటీ, పీజీటీ మ్యాథ్స్‌, టీజీటీ సైన్స్‌, టీజీటీ హిందీ బోధించేందుకు ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీ ఉన్నట్టు చెప్పారు. అవర్లీ బేస్‌పై ఒక పీరియడ్‌కు రూ.183 చొప్పున వంద పీరియడ్లకు రూ.18,200 గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. ఎంఎస్సీ మాథ్స్‌, ఎంఎస్సీ సైన్స్‌ (బాటనీ, జువాలజీ) బీఎస్సీ సైన్స్‌, ఎంఏ హిందీతో పాటు బీఎడ్‌ అర్హత కలిగిన వారు జూలై 2వ తేదీలోగా మోడల్‌ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీపీఆర్‌ చేసి.. ప్రాణాలు కాపాడి



మున్నాలాల్‌కు సీపీఆర్‌ చేస్తున్న సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్‌ : సీపీఆర్‌ చేసి 108 సిబ్బంది ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ మండల పరిధిలో చోటుచేసుకుంది. 108 వాహన సిబ్బంది దశరథ, శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌ పోచంపల్లి మండలం నారాయణగిరి గ్రామంలోని సాయి తేజ డ్రగ్స్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీలో ఆదివారం మధ్యాహ్నం గ్యాస్‌ లీకై మున్నాలాల్‌, పరమేశ్వర్‌, దేవశరన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మున్నాలాల్‌ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో తక్షణమే స్పందించిన సిబ్బంది అతడికి సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఆస్పత్రికి తరలించారు.

విన్నపాలు.. బుట్టదాఖలు!

ప్రజాభవన్‌ వేదికగా బాధితుల విజ్ఞప్తులు

- పరిష్కారానికి నోచుకోని అర్జీలు
- కలెక్టరేట్‌లో అందిన ఫిర్యాదులదీ అదే పరిస్థితి
- సీరియస్‌గా తీసుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు



కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్‌, ఇతర అధికారులు (ఫైల్‌)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా ఉన్నతాధికారి నుంచి ఏదైనా లేఖ వస్తే.. యంత్రాంగం తక్షణమే స్పందిస్తుంది. క్షేత్రస్థాయిలోని అధికారులంతా హడావుడి చేస్తుంటారు. కానీ సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం (ప్రగతి భవన్‌) వేదికగా స్వీకరించిన 'ప్రజాదర్బార్‌' దరఖాస్తులను జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన బాధితులకు తీరా నిరాశే మిగులుతోంది. పరిపాలనలో పారదర్శకత, ప్రజల సమస్యల సత్వర పరిష్కార మార్గం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాభవన్‌ వేదికగా ప్రజాదర్బార్‌ పేరుతో వారానికి రెండు రోజులు (మంగళ, శుక్ర), జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' పేరుతో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కీలకశాఖల అధికారులంతా అక్కడే ఉంటుండటంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం లభిస్తుందని భావించిన బాధితులు దూరాన్ని సైతం లెక్క చేయకుండా అనేక వ్యయ ప్రయాసలకోర్చి ప్రజాభవన్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్నారు. తమ గోడును అధికారుల వద్ద వెళ్లబోసుకుంటున్నారు. ఇలా ఇప్పటి వరకు ప్రజాభవన్‌కు రంగారెడ్డి జిల్లా నుంచి 2,033 దరఖాస్తులు అందాయి. వీటిలో 270 దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం చూపారు. మరో 1,763 పెండింగ్‌లో పెట్టారు. ఇక హైదరాబాద్‌ జిల్లా నుంచి 596 అర్జీలు అందగా, వీటిలో ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదు. మేడ్చల్‌ జిల్లా నుంచి 1,194 ఫిర్యాదులు అందగా వీటిలో 1,154 పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో మెజార్టీ దరఖాస్తులు భూ వివాదాలు, డబుల్‌ బెడ్రూం ఇళ్లు, పెన్షన్లకు సంబంధించినవే ఉండడం గమనార్హం. సీఎంఓ నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్వీకరణతో సరి.. పరిష్కారం ఏదీ?

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఓటమిపాలై.. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజావాణికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికల కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని డిసెంబర్‌ 11న పునరుద్ధరించింది. డిసెంబర్‌ 11న జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో 132 దరఖాస్తులు అందగా, జనవరి 8న 140 దరఖాస్తులు, 22న 40 అందాయి. ఫిబ్రవరి 5న 158 అర్జీలు అందగా, 26న 82 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికలతో నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని జూన్‌ 10న పునరుద్ధరించారు. జూన్‌ 10న 79 ఫిర్యాదులు, 24న 140 అందాయి. ఎప్పటికప్పుడు వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపి పరిష్కార మార్గం చూపించాల్సిందిగా కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మెజార్టీ దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో అత్యధికంగా భూ వివాదాలకు సంబంధించినవే కావడం గమనార్హం. ఇదిలా ఉంటే ధరణి పోర్టల్‌లోని 33 మాడ్యుల్స్‌ ద్వారా 40,242 దరఖాస్తులు రాగా వీటిలో ఈ నెల 15 నుంచి 28 వరకు నిర్వహించిన స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా 3,779 దరఖాస్తులను పరిష్కరించారు. మరో 36,463 పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ప్రజాదర్బార్‌ దరఖాస్తులు ఇలా..

జిల్లాపేరు	స్వీకరించిన అర్జీలు	పెండింగ్‌లో ఉన్నవి
హైదరాబాద్‌	596	596
రంగారెడ్డి	2,033	1,763
మేడ్చల్‌	1,194	1,154
వికారాబాద్‌	478	107



గవర్నర్‌ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెండింగ్‌ బిల్లులు ఇప్పించండి

- గవర్నర్‌కు సర్పంచ్‌ల సంఘం నాయకుల వినతి

కడ్తాల్‌: పంచాయతీలకు రావాల్సిన పెండింగ్‌ బిల్లులను ప్రభుత్వం వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్యగౌడ్‌ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 2019–24 సంవత్సరాల మధ్య కాలంలో సర్పంచ్‌లుగా కొనసాగి, అప్పటి ప్రభుత్వ సూచనల, ఆదేశాల మేరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమయంలో నిధులు అందకపోయినా, సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయాలని.. ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సొంత డబ్బులు వెచ్చించినట్లు తెలిపారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఐదు నెలలు గడిచినప్పటికీ పెండింగ్‌ బిల్లులు అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేసి ఖర్చు పెట్టిన సర్పంచ్‌లకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ విషయాన్ని అధికారులకు, ప్రభుత్వం దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యమని పేర్కొన్నారు. పెండింగ్‌ బిల్లులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సుభాష్‌, ప్రసన్నరెడ్డి, గణేశ్‌, రాజేందర్‌, సుముద్రాల రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే ధ్యేయం

జెడ్పీ ఛైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి



హర్షగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న తీగల అనితారెడ్డి

మహేశ్వరం: జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు జెడ్పీ ఛైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారం, నందుపల్లి, మన్సాన్‌పల్లి, రామచంద్రగూడ, పెండ్యాల, ఉప్పుగడ్డ తండా, గంగారం, హర్షగూడ, మహేశ్వరం గ్రామాల్లో రూ.1.07 కోట్ల జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో జిల్లాను అభివృద్ధి పరిచేందుకు శాయశక్తులా పని చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మరిన్ని నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్‌, పంచాయతీ రాజ్‌ డీఈ ప్రభు, ఎంపీడీఓ శైలజ, కాంగ్రెస్‌ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'మాఫీ'పై హ్యాపీ



- రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షాతిరేకాలు
- మార్గదర్శకాలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్న రైతులు

షాబాద్‌: పంట రుణాల మాఫీకి రాష్ట్ర మంత్రి వర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రూ.2లక్షల వరకు రుణాన్ని ఏక కాలంలో మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో బీఆర్‌ఎస్‌ హయాంలో రుణమాఫీ పొందని రైతులకు ప్రస్తుతం లబ్ధి చేకూరనుంది. 2018 డిసెంబర్‌ 12 నుంచి 2023 డిసెంబర్‌ 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కటాఫ్‌ తేదీ ఖరారు కాగా.. రుణమాఫీకి ఎవరు అర్హులనే అంశాలకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది. వారం రోజుల్లో మార్గదర్శకాలు జారీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించిన విషయం తెలిసిందే. మార్గదర్శకాలు జారీ చేస్తే రుణ మాఫీపై మరింత స్పష్టత రానుంది. బీఆర్‌ఎస్‌ హయాంలో కొద్ది మందికే మాఫీ సొమ్ము జమైంది. నిధులు సకాలంలో విడుదల చే యకపోవడంతో పంట రుణం మాఫీకి ఎంతో మంది అర్హులు దూరమయ్యారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు రూ. 2లక్షల వరకు రైతు రుణాన్ని మాఫీ చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది.

ఏళ్లుగా ఎదురుచూపులు

గత ప్రభుత్వం రూ.లక్షలోపు రైతు రుణమాఫీ చేసింది. విడతల వారీగా చేపట్టడంతో తమ వంతు ఎప్పుడా అని రైతులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇందులోనూ కొందరికి ఇంకా మాఫీ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తాజాగా కాంగ్రెస్‌ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనే రూ.2లక్షల రుణ మాఫీని ఏకకాలంలో చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పలు పథకాలు ప్రకటించిన ప్రభుత్వం గత డిసెంబర్‌ 9నే రుణమాఫీ కూడా చేస్తుందని రైతాంగమంతా భావించింది. భారీ బడ్జెట్‌తో కూడుకుని ఉండటంతో కొత్త సర్కారు కొంత సమయం తీసుకుంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోపుగా రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం దీనిపై నిర్ణయం తీసుకుంది.

కుటుంబమే ప్రామాణికంగా..

ఒక కుటుంబంలో ఐదుగురి పేరిట తలా రూ.లక్ష చొప్పున రుణం పొందితే ఆ మొత్తం రూ.5 లక్షలు అవుతుంది. కానీ, వారికి రూ.2లక్షల వరకే రుణమాఫీ పరిమితి ఉంటుంది. ఐదుగురిలో ఇద్దరి ఖాతాలకే మాఫీ వర్తిస్తుంది. రేషన్‌ కార్డును కూడా ఇందులో అనుసంధానం చేయనున్నారు. అందులోని కుటుంబ సభ్యుల ప్రత్యామ్నాయాన్ని నిర్ణయించనున్నారు. ఒక కుటుంబంలో ఒక్క రైతు పేరిటే రూ.2 లక్షల రుణం పొందితే అది పూర్తిగా మాఫీ అవుతుంది. ఖాతాల వారీగా మాఫీ చేసినట్లయితే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని భావిస్తున్నారు. అందుకే రూ.2లక్షల వరకే పరిమితి విధించేలా కసరత్తు చేస్తున్నారు.

స్పష్టతపై చర్చ

రుణమాఫీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపినప్పటికీ ఉత్కంఠ వీడటం లేదు. రూ.2 లక్షల రుణ మాఫీకి అర్హత పొందాలంటే రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీటి విషయంలో ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు రుణమాఫీకి అనర్హులనే ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆయా వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 2023 డిసెంబర్‌ 9 కటాఫ్‌ విధించగా.. ఆ తర్వాత రుణాలు పొందిన వారు కూడా తమను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు మాఫీ కోసం రైతులు ఎదురుచూస్తుండగా.. దశల వారీగా చేస్తారా అనే విషయంపై చర్చ కొనసాగుతోంది.

మాట నిలబెట్టుకున్నారు



రైతులకు పంట రుణాలను మాఫీ చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకుంటున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో ఒక విధంగా పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన అన్యాయం జరగకుండా చూస్తున్నారు.

– గడ్డం చంద్రయ్య, కాంగ్రెస్‌ పార్టీ బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు, షాబాద్‌

రైతులు రుణపడి ఉంటారు



కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని చూస్తోంది. పంట రుణాలను ఒకేసారి మాఫీ చేస్తే రైతులు రుణపడి ఉంటారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇచ్చాం అనే సాకుతో రుణమాఫీ చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం రుణమాఫీ విషయంలో స్పష్టతతో ఉంది.

– జాకీర్‌ షరీఫ్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు, పోతుగల్‌, షాబాద్‌ మండలం

ఆనందంగా ఉంది



వ్యవసాయ పనుల కోసం 2023లో నాగర్‌గూడ ఎస్‌బీఐ నుంచి రూ.95 వేల రుణం తీసుకున్నాను. ఈ రుణం తీర్చలేక ఇబ్బంది పడుతున్న సమయంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన చేయడం ఆనందంగా ఉంది. త్వరగా రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి.

– బీరప్ప, రైతు, నాగర్‌గూడ, షాబాద్‌ మండలం

హైదరాబాదీ బిర్యానీకి.. 6వ స్థానం..

ఉత్తమ భారతీయ రుచుల్లో తొలి స్థానంలో మ్యాంగో లస్సీ

ఫుడ్‌ ట్రావెల్‌ గైడ్‌ టేస్ట్‌ అట్లాస్‌ ర్యాంకుల్లో వెల్లడి

గతేడాది టాప్‌ 10 జాబితాలో చోటు దక్కని బిర్యానీ



దేశంలో తనకంటూ ప్రత్యేక ప్రాచుర్యాన్ని పొందిన హైదరాబాద్‌ బిర్యానీ మరోసారి తన ఘనతను చాటుకుంది. సంప్రదాయ వంటకాలకు సంబంధించిన పరిశోధన, సమీక్షలకు పర్యాటక ప్రదేశాల గురించిన సమాచారానికి పేరొందిన ఆన్‌లైన్‌ వేదిక టేస్ట్‌ అట్లాస్‌.. అత్యున్నత భారతీయ వంటకాల్లో హైదరాబాద్‌ బిర్యానీకి 6వ స్థానాన్ని కట్టబెట్టింది. గతేడాది ఇదే సంస్థ అందించిన ర్యాంకుల్లో మన బిర్యానీకి చోటు దక్కని నేపథ్యంలో ఈ ఏడాది తన పాపులారిటీని తిరిగి నిలబెట్టుకోగలిగింది.

– సాక్షి, సిటీబ్యూరో



సిటిజనులకు అత్యంత ప్రీతిపాత్రమైన వంటకంగానే కాక నగర సంప్రదాయ వంటకాల విశిష్టతను నలుదిశలా చాటేదిగా, దేశ విదేశీ ప్రముఖులకు నగర సందర్శనలో తప్పనిసరిగా 'రుచి'ంచే మన బిర్యానీ టేస్ట్‌ అట్లాస్‌ జాబితాలో టాప్‌ 10లో నిలవగా.. మన నగరంలో విరివిగా ఇష్టపడే బటర్‌ చికెన్‌, తందూరీ చికెన్‌ వంటివి కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

నం1గా మ్యాంగో లస్సీ

ఈ జాబితాలో మ్యాంగో లస్సీ నంబర్‌ 1గా నిలిచింది. వేసవిలో విరివిగా జనం ఆస్వాదించే ఈ లస్సీకి జాబితాలో అగ్రస్థానం దక్కింది. అదే విధంగా దాని తర్వాతి స్థానంలో మసాలా చాయ్‌ నిలిచింది. ఇది అనేకమందికి, నగరవాసులకు రోజువారీ అవసరం అనేది తెలిసిందే. ఫుడ్‌ లవర్స్‌ ఇష్టపడే బటర్‌ గార్లిక్‌ నాన్‌కు మూడో ర్యాంక్‌ దక్కింది. ఆ తర్వాత అమృత్‌ సర్‌ కుల్చా, బటర్‌ చికెన్‌ వరుసగా నాలుగు, ఐదు ర్యాంకులు దక్కాయి. ఆ తర్వాత మన హైదరాబాదీ బిర్యానీ ఆరు, షాహి పనీర్‌ ఏడు, చోలే భటూర్‌ ఎనిమిది, తందూరి చికెన్‌ తొమ్మిది, కోర్మా పదో ర్యాంకును దక్కించుకున్నాయి.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం: అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న సీపీఎంకు గ్రామాల్లో పూర్వ వైభవం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడ గేట్‌ వద్ద ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం పార్టీ యాచారం మండల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచి పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు క్రమ శిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్‌, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి జంగయ్య, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్‌ జంగయ్య, జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చరికొండ గ్రామ సమీపంలో ప్రమాదకర మలుపు

మృత్యు మార్గాలు

ప్రమాదకర మలుపులతో వాహనదారుల భయాందోళన

కడ్తాల్: ప్రమాదకర మలుపులతో వాహనచోదకు లు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లలో ఉన్న మూల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడంతో భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ప్రమాదాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయని పరిసరప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఊహించనిప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి, సూచిక బోర్డులతో పాటు,ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



చల్లంపల్లి సమీపంలో సూచిక లేని.. రోడ్డు

బైక్ ఢీకొని కార్మికుడికి గాయాలు

మొయినాబాద్: గుర్తుతెలియని బైక్ ఢీకొట్టడంతో పంచాయతీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి చిలుకూరు బాలాజీ టెంపుల్ కమాన్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన ఆర్.ప్రవీణ్ జీపీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి దేవాలయ కమాన్ వద్ద ప్రవీణ్ నిలబడి ఉండగా.. గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనంలో ప్రవీణ్ తలకు గాయాలు కావడంతో పాటు కాలు విరిగింది. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని ఆటోలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా తెలిపారు.

ప్రమాదపుటంచుల్లో కష్టజీవులు

కొండలు కరిగించే శక్తే వారి ఆయుధం. నిరంతర శ్రమే ఏకైక లక్ష్యం. కాలుష్యపు కోరల మాటున.. దుర్భరమైన దుస్థితిలో కష్ట నష్టాలను ఎదుర్కొంటూ చెమట చిందిస్తున్న శ్రమజీవుల జీవితాలు గాలిలో దీపంలా మారాయి. పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యానికి వారి నిండు ప్రాణాలు బలైపోతున్నాయి.

భారీ యంత్రాల మధ్య భద్రతలేని జీవితాలు

- గాలిలో దీపంలా మారిన కార్మికుల బతుకులు
- నిబంధనలు పాటించని పరిశ్రమలు
- యాజమాన్యాల నిర్లక్ష్యానికి బలవుతున్న వలస జీవులు
- తనిఖీలు పట్టని అధికారులు

షాద్‌నగర్: పరిశ్రమలు కాలుష్య నిలయాలుగా, ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. జిల్లాలో సుమారు 40 శాతం కాలుష్య కారక కంపెనీలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వీటిల్లో పని చేస్తున్న కార్మికులు తరచూ అనారోగ్యం పాలవుతుంటారు. పరిశ్రమల యజమానులు సంపాదనకు ఇస్తున్న ప్రాధాన్యత కూలీల భద్రతకు ఇవ్వక పోగా.. వెట్టి చాకిరీ చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. కనీస ప్రమాణాలు పాటించకపోవటంతో పనిచేసే చోట కార్మికుల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయింది. కనీసం గుర్తింపు కార్డు ఇవ్వకపోవడంతో పాటు.. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు పరిశ్రమల్లో కార్మికులకు వర్తింపజేయడం లేదు. యాజమాన్యం వేధించినా మరో దారి లేక, తమ హక్కులను పక్కన పెట్టి రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.



నందిగామలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలిపోతున్న ఫార్మా పరిశ్రమ

సకాలంలో చికిత్స అందక

షాద్‌నగర్ పరిధి బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఇటీవల జరిగిన పేలుడు ఘటన హృదయాలను కలచి వేసింది. పరిశ్రమల్లో ఆటో క్లేవ్ యూనిట్ వద్ద పని చేస్తున్న కార్మికులు పేలుడు ధాటికి తునాతునకలయ్యారు. శరీర భాగాలు పరిశ్రమ ఆవరణలో ఎగిరి పడిన దుస్థితిని చూసి అయ్యో పాపం అనని వారు లేరు. గతంలో పలు పరిశ్రమల్లో ఇలాంటి ఘటనలు జరిగినా.. కార్మికుల కుటుంబాలకు కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాలను వారి రాష్ట్రాలకు తరలించిన ఘటనలు ఉన్నాయి. చాలా కంపెనీల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను చికిత్స కోసం తరలించే అంబులెన్స్ సౌకర్యం లేక, సరైన సమయంలో వైద్యం అందక ఆసుపత్రిలో చేర్చేలోపే కష్టజీవులు మృత్యువాత పడుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

పరిశ్రమల్లో రక్షణ చర్యలు పరిశీలించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాల నివారణ, కార్మికుల భద్రత తదితర అంశాలకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు నిత్యం తనిఖీలు చేపట్టాలి. కానీ.. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తూ.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కర్మాగారాల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి విధిగా రక్షక కవచాలు అందించాల్సి ఉంటుంది. కాని అవి మచ్చుకు కూడా కనిపించవు.

హక్కులు కాగితాలకే పరిమితం

పరిశ్రమల యాజమాన్యాల విధానంలో మార్పులు వస్తేనే తమ జీవితాల్లో వెలుగు వస్తాయని కార్మికులు అభిప్రాయ పడుతున్నారు. కార్మికుల హక్కులను కాగితాలకు పరిమితం చేయకుండా ఆచరణలోకి తీసుకొచ్చి, ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టి, ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు రక్షణ కవచాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.



గ్లాస్ పరిశ్రమలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

రక్షణ లేని జీవితాలు

పరిశ్రమల్లో పని చేయడం అంటే నిత్యం ప్రమాదపుటంచుల్లో పయనించడమే. ఏ పరిశ్రమలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి. ప్రమాదకరమైన యంత్రాల మధ్య భయం గుప్పిట్లో పని చేస్తున్న కార్మికులు క్షేమంగా ఇంటికి వస్తారన్న నమ్మకం లేదు. కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో బాయిలర్లు, రియాక్టర్లు బాంబుల్లా పేలి శ్రమజీవులను మాంసపు ముద్దల్లా మారుస్తున్నాయి. వారిని నమ్ముకున్న కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి.

జిల్లాలోని పరిశ్రమలు

జిల్లాలో భారీ, మధ్య, చిన్న పరిశ్రమలు సుమారు 3,474 ఉన్నాయి. ఇందులో మైక్రో పరిశ్రమలు 2,182, చిన్నవి 1,094, మధ్య తరహా 62, భారీ 103, మెగా 9, మెగా ఇన్‌ఫ్రా 24 వరకు ఉన్నాయి. ఇందులో బిహార్, ఒడిస్సా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు సుమారు 50వేల మంది పని చేస్తున్నారు.

భద్రత కల్పించాలి



పరిశ్రమల్లో ప్రమాదకరమైన యంత్రాల మధ్య కార్మికులు పనిచేస్తుంటారు. వారి పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. శ్రమదోపిడీకి పాల్పడుతూ.. కనీస భద్రత కల్పించకుండా, రక్షక కవచాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వారి ప్రాణాలను గాలిలో దీపంలా మారుస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు బలైపోతున్నారు. కష్టజీవుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

– ఎస్.రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే..



పొట్టచేత పట్టుకుని వచ్చిన వలస జీవుల పట్ల పరిశ్రమల యాజమన్యాలు చిన్నచూపు చూస్తున్నాయి. తద్వారా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆశాఖ అధికారులు.. కార్మికుల భద్రతను పరిగణలోకి తీసుకుని, పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. కనీసం ప్రమాణాలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలి. వారి నిర్లక్ష్యమే పరిశ్రమల్లో ప్రమాదాలకు కారణం.

– శ్రీను నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

కానరాని రైతు నేస్తాలు

భారంగా మారిన పశుపోషణ

- యంత్రాలతోనే ఎవుసం
- పెరిగిన సాగు పెట్టుబడి
- రైతులకు ఆర్థిక భారం

షాబాద్: వ్యవసాయ పనుల్లో అన్నదాతలకు అండగా ఉండే కాడెడ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పెరుగుతున్న యాంత్రీకరణ జీవనవిధానం, పశుపోషణ భారంగా మారడంతో కాడెడ్ల ఆదరణ పూర్తిగా తగ్గింది. సాగు మొదలు పంట ఉత్పత్తులను తరలించేంత వరకు తోడుగా ఉండేవి. ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. పశుపోషణ భారమై.. ఆధునిక యంత్రాలు, ట్రాక్టర్ల వాడ కానికి మొగ్గుచూపడంతో ఎడ్లు సాగు పనులకు దూరమవటమే కాకుండా.. వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పశుపోషణ కష్టంగా భావించిన రైతులకు యంత్రాల వాడకంతో పని వేగవంతమైనా.. పెట్టుబడులు విస్తృతంగా పెరిగాయి. ట్రాక్టర్ల యాజమానులు గంటకు కిరాయి రూ.1300 నుంచి రూ.1500 వరకు డిమాండ్ చేస్తుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నారు.

ఆసక్తి చూపని అన్నదాతలు

పశుపోషణ భారం కావడంతో పొలం పనుల్లో ఎడ్ల వినియోగం రోజురోజుకూ తగ్గిపోతోంది. నాడు ప్రతి గ్రామంలో అధికశాతం రైతుల కుటుంబాల్లో ఎనలేని పశు సంపద ఉండేది. అందులో పాడి పశువులతో పాటు, కాడెండ్లు ఉండేవి. ఎడ్లను పొలం పనులకు, బర్లతో పాల ఉత్పత్తి పొంది, లబ్ధిపొందేవారు. కానీ.. ప్రస్తుతం అవి పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అన్నదాతలు కూడా వాటి పెంపకానికి ఆసక్తి చూపించడం లేదు.



షాతాళ్లపల్లి గ్రామంలో ట్రాక్టర్లతో కరిగెట్లు చేస్తున్న రైతు

పెరిగిన యంత్రాల వినియోగం

వ్యవసాయ పనులకు కూలీలపై ఆధారపడకుండా రైతులు ట్రాక్టర్ల ద్వారా పనులు చేపడుతున్నారు. పత్తి కర్రను తొలగించేందుకు ఎకరానికి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లిస్తున్నారు. దుక్కి దున్నేందుకు ఎకరానికి రూ.1300 నుంచి 1500 వరకు వెచ్చిస్తున్నారు. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ కోసం ఎకరానికి రూ.100 నుంచి రూ.1400 వరకు ఖర్చు పెడుతున్నారు.



షాబాద్‌లో పొలం చదును చేస్తున్న వాహనం

ట్రాక్టర్‌తో అన్ని పనులు



మునుపు కాడెడ్లతో వ్యవసాయం పనులు చేసేవాళ్లం. పత్తి కర్రల తొలగించడం మొదలు.. దుక్కి దున్నడం, చదును చేయడం ఎడ్లతోనే చేశాం. వాటి పోషణ భారంగా మారడంతో.. ప్రస్తుతం ట్రాక్టర్లు, యంత్రాలను వినియోగించాల్సి వస్తోంది.

– చంద్రబాబు, రైతు, షాబాద్

పెరిగిన డిమాండ్



వ్యవసాయ పనుల్లో కాడెడ్ల వినియోగం తగ్గి, యంత్రాల ఉపయోగం విస్తృతం అయింది. దీంతో గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లు తదితర వాటితో సాగు పనులు చేస్తున్నారు. రైతులందరూ ఒకేసారి పొలం బాట పట్టడంతో వాహనదారులకు డిమాండ్ పెరిగింది. కిరాయిలు పెంచేశారు.

– బాల్‌రాజ్, రైతు, తాళ్లపల్లి

ట్రేడింగ్ పేరిట భారీ మోసం

రూ.14 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రేడింగ్ ప్రకటనలు చూసి, అధిక లాభాల ఆశచూపి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 35 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రేడింగ్‌కు సంబంధించిన ప్రకటనను చూశాడు. ఆ లింక్‌ను క్లిక్ చేసి వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఆ గ్రూప్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశచూపారు. ఒక నెల పాటు స్టాక్ ట్రేడింగ్‌లో ఉన్నట్లు చూపించారు. అనంతరం సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత వివరాలను నమోదు చేయించారు. మొదట ట్రేడింగ్ అప్లికేషన్‌ను ఉపయోగించి లాభాలను ఆర్జించి, మళ్లీ పెట్టుబడులు పెట్టాడు. ఈ విధంగా విడతల వారిగా బాధితుడు వద్ద నుంచి రూ.13,96,640 కాజేసి మోసం చేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో అకౌంట్ బ్లాక్ అవడంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నారంటూ మహిళకు టోకరా

డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఓ మహిళా ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగరానికి చెందిన 24 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగినికి ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ నుండి కాల్ వచ్చింది. డ్రగ్స్‌తో కూడిన ఒక ప్యాకేజీ తన పేరుతో ఉందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసు నమోదైందని ముంబైకి కాల్ బదిలీ చేస్తున్నామన్నారు. అనంతరం స్కైప్ ద్వారా వీడియో కాల్‌లో పోలీస్ అధికారుల మారువేషంలో ఉన్న సైబర్ నేరగాళ్లు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారని బెదిరించారు. ఆమెకు సంబంధించిన ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలతో వ్యక్తిగత వివరాలను, ఐదున్నర సంవత్సరాల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను చూపించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు వారు చెప్పిన విధంగా రూ.9 లక్షలు వారి ఖాతాకు బదిలీ చేసింది. అనంతరం మోసపోయానని గ్రహించి బాధితురాలు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.